క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా చదవాలి


సూచనలిస్తున్న ఆర్‌ఐఓ దుర్గారావు

పాతపట్నం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని శ్రీకాకుళం ఆర్ఐఓ పి.దుర్గారావు అన్నారు. పాతపట్నం బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను, మహేంద్ర జూనియర్ కళాశాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని ఏర్పరుచుకుని చదవాలన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు అపార్ ఐడీ నెంబర్లు ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు వి.అర్చన, ఎం.అంజనేయులు, ఎస్.మధుబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రమణ

జలుమూరు: చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను పూర్తిస్థాయి వినియోగంలోకి తేవాలని డీఎల్‌పీఓ ఐ.వి.రమణ అన్నారు. రావిపాడులోని చెత్త సంపద కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. మండల పరిధిలో ఎన్ని కేంద్రాలు వినియోగంలోకి ఉన్నాయి, ఇంకా రానివి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శిలతో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను వసూలు చేయాలని, గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ కొమరావు తిరుపతిరావు, పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సారవకోట: మండలంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శనివారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి రూ.1.84 కోట్లతో పలుచోట్ల రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. సారవకోట-కిడిమి రోడ్డు నుంచి సోమయ్యపేటకు, సింగంవలసకు, బుడ్డయ్యపేట గ్రామాలకు వెళ్లేందుకు రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ధర్మాన తేజ్‌కుమార్, ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

22 నుంచి గ్రామ సభలు

నరసన్నపేట: భూ రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో తప్పుల సవరణకు ఈ నెల 22వ తేదీనుంచి నవంబర్ 25 వరకు గ్రామ సభలు నిర్వహిస్తామని, ఈ మేరకు గ్రామాల్లో రైతులను, ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ సిబ్బందికి నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణ ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల జాబితా సిద్ధం చేయాల్సి ఉంటుందన్నారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలని, ఈ మేరకు వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్లు సిద్ధం కావాలన్నారు. మండల సర్వేయర్ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకం పునఃప్రారంభానికి చర్యలు


ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న డీఈఈ కామరాజు

కొత్తూరు: మండలంలోని పొనుటూరు ఎత్తిపోతల పథకం పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏపీ నీటి పారుదల అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఐడీసీ) శ్రీకాకుళం విభాగం డీఈఈ ఎం.కామరాజు తెలిపారు. ఎత్తిపోతల పథకాన్ని శనివారం డీఈఈ, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఎత్తిపోతల పథకం వివరాలను డీఈఈకి రైతులు వివరించారు. ఎత్తిపోతల పథకం మరమ్మతులకు అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరుగుతుందని డీఈఈ తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

రూ.10 వేల విరాళం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్- 2 ఆర్ఆర్ కాలనీలో ఉన్న అడవికొత్తూరు ఎంపీపీ పాఠశాలకు మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు శనివారం రూ.10 వేలను హెచ్ఎం గేదెల వెంకటరమణకు అందజేశారు. విద్యార్థులకు ఆట వస్తువులు కొనుగోలు చేయాలని శ్రీనివాసరావు చెప్పారు. శ్రీనివాసరావుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్య కార్మికులు.. పస్తులు..!


కొత్తూరు మండల కేంద్రంలోని కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

- ఐదు నెలలుగా అందని వేతనాలు
- ఆరేళ్ల నుంచి వేతనాలు పెరగక అవస్థలు
- రోజుకు కేవలం రూ.200 మాత్రమే కూలీ పడుతున్న వైనం..

కొత్తూరు: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత ఐదు నెలలుగా వేతనాలు అందక పస్తులు ఉంటున్నారు. ఈ ప్రభుత్వం పంచాయతీలకు చెల్లించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు నేటికీ చెల్లించలేదు. దీంతో పారిశుధ్య కార్మికులు ఆయా పంచాయతీల నుంచి జీతాలు అందడం లేదు. పాతపట్నం నియోజవర్గంలోని ఐదు మండలాల్లోని 159 పంచాయతీల్లో 324 మంది గ్రీన్ అంబాసిడర్‌లు (పారిశుధ్య కార్మికులు) పని చేస్తున్నారు. గ్రామాల్లో చెత్త సేకరించి చెత్త సంపద కేంద్రాలకు, డప్పింగ్ యార్డులకు రిక్షాలపై తరలిస్తున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు వివరాలు ఇలా..

మండలం	పంచాయతీలు	పారిశుధ్య కార్మికులు
కొత్తూరు	43	91
ఎల్.ఎన్.పేట	22	25
పాతపట్నం	34	96
హిరమండలం	23	56
మెళియాపుట్టి	37	56

పెరిగిన పనిభారం..

వేకువ జాము నుంచే విధుల్లోకి చేరుతున్న పారిశుధ్య కార్మికులకు.. టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మరింత పనిభారం పెరిగింది. రోజువారీ విధులతోపాటు పారిశుధ్య వారోత్సవాలు, మాసోత్సవాలను వీరితోనే నిర్వహిస్తోంది. పంచాయతీలకు జమ అవుతున్న 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి ప్రతీ కార్మికుడికి నెలకు కేవలం రూ.6 వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారు. ఆరేళ్లుగా వేతనాలు పెంచకపోవడంతో కార్మికులు చాలీ చాలనీ వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వేతనాలు చెల్లించాలని పలుసార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఎటువంటి సెలవులు లేకుండా ప్రతీరోజు పనిచేస్తున్నారు. పండగలు వస్తున్నందున బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.

వేతనాలు పెంచలేదు


ఆరేళ్ల నుంచి పారిశుధ్య కార్మికునిగా పనిచేస్తున్నాను. పనిభారం పెరిగింది. వేతనం మాత్రం పెరగలేదు. నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించడం లేదు. చాలీ చాలని వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలు చెలించడంతోపాటు వేతనాలు పెంచాలి.

– బిడ్డిక సంజీవు, పారిశుధ్య కార్మికుడు, మహసింగి

నిధులు జమైన వెంటనే వేతనాలు చెల్లిస్తాం


ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు జమైనన వెంటనే పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం. కొన్ని పంచాయతీలలో నిధుల అవకాశం మేరకు వేతనాలు చెల్లించడం జరిగింది.

– బసవ రామ్‌ప్రసాద్, ఈఓపీఆర్డీ, కొత్తూరు

రోడ్డు మధ్యలో గొయ్యి..


సరుబుజ్జిలి మండలంలోని అలికాం-బత్తిలి రహదారిలో తమ్మినాయుడుపేట జంక్షన్ సమీపంలో రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడింది. రాత్రి వేళల్లో గొయ్యి కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పురుషోత్తపురం గ్రామానికి చెందిన పైడి అప్పలనాయుడు రాత్రి పూట ఈ గోతిలో పడటం వల్ల కాలు విరిగింది. అధికారులు స్పందించి గోతిని పూడ్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

గోతులమయం


ఆమదాలవలస పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లోపల రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. ఇటీవల ఈ రహదారి నిర్వహణ పనులు చేపట్టారు. ఆ నిర్మాణాల్లో నాణ్యత పాటించకపోవడంతో కొద్ది రోజులకే రోడ్డు పాడైంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు, ప్రయాణీకులు కోరుతున్నారు.

– ఆమదాలవలస

శిథిలావస్థ..


నరసన్నపేట మండలంలోని బడ్డవానిపేట వద్ద నూకాలమ్మ చానల్‌పై నడక వంతెన శిథిలమైంది. చానల్ దాటడానికి రైతులు, కూలీలు అవస్థలు పడుతున్నారు. పదేళ్ల క్రితం రైతుల సౌకర్యార్థం ఈ వంతెనను నిర్మించారు. వ్యవసాయ పనులు చేయడానికి రైతులు చానల్ దాటి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం నీరు అధికంగా ప్రవహిస్తోంది. చానల్ అవల వైపు పొలాలకు వెల్లడానికి వీలుకావడం లేదని, దీని స్థానంలో నూతన వంతెనను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

– నరసన్నపేట

రహదారిపైనే మురుగునీరు


ఎల్.ఎన్.పేట మండలంలోని దొంకలబడవంజ గ్రామంలోని ప్రధాన రోడ్లుపైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. రోడ్డు ఉన్నప్పటికీ డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదు. వర్షం నీరు, ఇళ్లల్లో వాడిక చేసిన నీరు రోడ్డుపైనే నిల్వ ఉంటుంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాపిచెందుతున్నాయన్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి కూనకు లేదు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్


మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవిమార్‌కు లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. ఆమదాలవలసలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంపై ఎమ్మెల్యే ఇటీవల చేసిన విమర్శలు అర్థ రహితమైనవన్నారు. మంత్రివర్గంలో చోటు దక్కక ఫ్రస్ట్రేషన్‌లో ఇష్టానురీతిలో మాట్లాడటం సరికాదన్నారు. 45 ఏళ్ల తమ్మినేని సీతారాం రాజకీయ జీవితంలో పదవులు వాటంతట అవే వెతుక్కుని వచ్చాయన్నారు. ఆమదాలవలస నియోజకవర్గం అభివృద్ధి తమ్మినేని సీతారాం హయాంలోనే జరిగిందన్నారు. మద్యం సిండికేట్‌లో మాజీ స్పీకర్ సీతారాం ఉన్నట్లు ఎమ్మెల్యే చేసిన విమర్శలను నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రతీ గ్రామంలో ఎవరు ఎన్ని రోడ్లు వేశారో బహిరంగ చర్చకు రావాలన్నారు. ఇసుక పాలసీలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు అనుమతులు ఇవ్వలేదంటూ పేర్కొన్న ఎమ్మెల్యే.. వందలాది లారీలతో ఇసుక ఎలా అక్రమంగా రవాణా చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజలకు నేరుగా డీబీటీ ద్వారా రెండు లక్షల 50 వేల కోట్లు వారి అకౌంట్లో జమ చేశామన్నారు. గత ప్రభుత్వ హయంలో రూ.3000 ఉన్న పెన్షన్‌ను రూ.4000కు పెంచి లబ్ధిదారుల్లో సగం మందిని తగ్గించారన్నారు. చంద్రబాబు తీసుకువచ్చిన కొత్త మద్యం పాలసీ కేవలం కూటమి నేతలకు ఆదాయ వనరుగా మిగిలిందన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టి సారించాలన్నారు. సగంలో ఆగిపోయిన బలసల రేవు వారిధిని పూర్తిచేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల, హార్టీకల్చర్ స్టేషన్ వంటి విద్యా సంస్థలకు శాశ్వత భవనాలు తీసుకువచ్చి వాటి నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. పార్టీ మున్సిపల్ మాజీవైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ కార్యకర్త పొన్నాడ చిన్నారావు పాల్గొన్నారు.

దాడులు చేస్తే సహించేది లేదు

- పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య


తిమడాంలో గొడియా రమణమ్మతో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

జలుమూరు: వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా కూటమి నాయకులు పథకం ప్రకారం దాడులు చేస్తున్నారని, ఆస్తులను నష్టపరుస్తున్నారని వీటిని ఎంత మాత్రం సహించబోమని వైఎస్సార్‌సీపీ బీసీ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. అల్లాడపేట, తిమడాం, అంధవరం, చెన్నయవలస, టి.లింగాలపాడు, హుస్సేనుపురం పంచాయతీలలో శనివారం పలువురిని పరామర్శించి మాట్లాడారు. అల్లాడపేటలో ఇటీవల కూటమి నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు తండ్యాల సింహాచలం, కల్యాణం సింహాచలం, జి.సూరిని పరామర్శించారు. గ్రామానికి చెందిన కల్యాణం అచ్చెన్న హత్య కేసులో దోషులకు శిక్షపడుతుందని, శిక్ష నుంచి తప్పించుకునేందుకు సాక్ష్యలను టీడీపీ నాయకులు భయపెడుతున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణచైతన్య దృష్టికి తెచ్చారు. తిమడాంలో గొడియా రమణమ్మ, బాబూరావు ఇంటిని, టిఫిన్ షాపును టీడీపీ నాయకుడు వెలమల చంద్రభూషణరావు, అతని కుమారులు రమేష్, మధు, తదితరులు యంత్రాలతో తొలగించారని కృష్ణచైతన్య దృష్టికి తీసుకువచ్చారు. కూటమి నాయకుల దాడిలో గాయపడినవారికి, ఆస్తులు నష్టపోయినవారికి అండగా ఉంటామని, ఈ విషయాలను ఎస్పీని కలిసి వివరిస్తామని కృష్ణచైతన్య అన్నారు. ఎంపీపీ వాన గోపి, అల్లాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, ధర్మాన జగన్, దామ మన్మధరావు, వెలమల అసిరి నాయుడు, పి.ముసలినాయుడు, పొన్నాడ విజయ్, వాన నాగేశ్వరరావు, గొలివి గోవిందరావు, ధర్మాన రమణ మూర్తి తదితరులు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ

హిరమండలం: హైకోర్టు ఆదేశాల మేరకు మేజర్ పంచాయతీ హిరమండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి తనిఖీ చేశారు. రికార్డులతోపాటు భోజనం, వంటగది, హాల్, బాత్‌రూమ్‌లు పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజన సౌకర్యం సక్రమంగా అందించాలన్నారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఎస్ఓ ఎస్.కృష్ణవేణి, కోర్టు సిబ్బంది, పోలీస్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని బొమ్మిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, లాబర గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలను పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి శనివారం తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక శ్రీనివాసనగర్‌లోని బీసీ బాలికల కాలేజీ వసతి గృహాన్ని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. బాత్‌రూమ్, టాయిలెట్లు అధ్వానంగా ఉండటాన్ని గుర్తించారు. వసతి గృహం ఇన్‌చార్జికి పలు సూచనలు చేశారు. నరసన్నపేట సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

పొందూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిశరాల పరిశుభ్రత పాటించాలని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బీ.జ్యోత్స్న విద్యార్థులు సూచించారు. రాపాక కూడలిలోని మహాత్మా జ్యోతీరావ్ పూలే పాఠశాలను, బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు.

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట కేజీబీవీని ఆమదాలవలస జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.మణి తనిఖీ చేశారు. తరగతి గదులు, విద్యార్థుల విశ్రాంతి గదులు, వంటశాల, స్టోర్ రూమ్, నిల్వ ఉన్న కూరగాయలు, ఇతర సరుకులు, ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలించారు. ఎంఈఓ కె చంద్రమౌళి, ఎస్ఓ ఎం.వి. అంబిక ఉన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు


సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: స్థానిక మార్కెట్ వీధిలో ఉన్న ఓం శాంతి భవనంలో బి.కె.సుధ బ్రహ్మకుమారీ ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతాలు శనివారం ఘనంగా నిర్వహించారు. బెంగూళురుకు చెందిన రాజయోగి బి.కె.మంజునాథ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రతి ఒక్కరిలోని భక్తిభవాలు పెంపొందించాలన్నారు. బి.కె.నీరజ, పాతపట్నం, మెళియాపుట్టి, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

హిరమండలం: ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేకాధికారి బి.రాజగోపాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో చర్చించిన సమస్యలను పరిష్కరించాలని ప్రత్యేకాధికారి అన్నారు. మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎంపీటీసీ సభ్యులు మీసాల రజినీ, బి.గంగాధర్, సావిత్రి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. చిన్న పంచాయతీలకు ఎక్కువ నిధులు, పెద్ద పంచాయతీలకు తక్కువ నిధులు కేటాయించారని అధికారులను ప్రశ్నించారు. జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు, ఎంపీడీఓ కాశీప్రసాద్, తహసీల్దార్ హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అప్రమత్తం..

ఎల్.ఎన్.పేట: తుఫాన్ హెచ్చరిక వెలువడటంతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. తహసీల్దార్ తన కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అన్ని వర్గాల వారిని అప్రమత్తం చేయాలన్నారు. ఉద్యోగులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. రైతులను మరింత అప్రమత్తం చేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.10 వేల ఆర్థికసాయం

పాతపట్నం: స్థానిక జగన్నాథ ఆలయం ఆవరణలో శివాలయం నిర్మాణానికి పాతపట్నం రత్నాలపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నల్లి రాజారావు, సుజాత దంపతులు రూ.10 వేల ఆర్థిక సహాయం శనివారం అందించారు. ఈ మొత్తాన్ని జగన్నాథ ఆలయ అర్చకుడు రవీంద్రనాథ్ పండా అందజేశారు. మాజీ ఎంపీటీసీ మల్లికార్జునరావు, ప్రసన్న పండా, సంతోష్, రమణ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆమదాలవలస: మిషన్ వాత్సల్య పథకం 2024–25 సంవత్సరానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమదాలవలస ఐసీడీఎస్ పీఓ అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథక ఉద్దేశం నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు విద్య, వైద్య అభివృద్ధి కోసం నెలకు రూ.4 వేలు ఆర్థిక సహాయం అందించడమన్నారు. మార్చి 2025 నాటికి 18 ఏళ్లలోపు వయస్సు కలిగి తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, ఇతర కుటుంబాలలో నివసిస్తున్న అనాథ పిల్లలు అర్హులన్నారు. తల్లి, తండ్రి ఇరువురికి క్యాన్సర్, ఎయిడ్స్, డయాలసిస్ వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవా వంటి ప్రభుత్వ పథకాలు పొందని వారై ఉండాలన్నారు. లబ్ధిదారుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.72,000, పట్టణ ప్రాంతాల్లో రూ.96,000 మించకూడదన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న పిల్లలకు వర్తిస్తుందన్నారు. దీనికి సంబంధించి ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల 25 వతేదీ లోగా దరఖాస్తులు అందజేయాలని సీడీపీఓ తెలిపారు.

కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు చర్యలు


కిచెన్ గార్డెన్‌లను పరిశీలిస్తున్న అధికారులు

పొందూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీకాకుళం ఉపవిద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి తెలిపారు. మండలంలోని తాడివలస జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల భవనాల మరమ్మతులు, ఆధునికీకరణతోపాటు మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుదీకరణ వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి సారించడం జరుగుదుందన్నారు. తాడివలస పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను ప్రశంసించారు. విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం బల్ల కంఠయ్య, ఉపాధ్యాయుడు పూజారి హరిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కార్తీక స్నానాలకు మహేంద్రతనయ సిద్ధం

మెళియాపుట్టి: కార్తీక స్నానాలకు మహేంద్రతనయ నదికి సిద్ధం చేస్తున్నట్లు ఎరుసు శ్రీనివాసరావు తెలిపారు. తన సొంత నిధులు వెచ్చించి జేసీబీతో శనివారం పిచ్చిమొక్కలు తొలగించారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ భానోజీరావు, దున్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

సరుబుజ్జిలి: గ్రామాల్లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు . మండలంలోని రావివలస, పురుషోత్తపురం, రావివలస, నందికొండ, మతలబుపేట గ్రామాల్లో శనివారం పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను సకాలంలో చెల్లిస్తామన్నారు.

రహదారి నిర్మాణం


రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రంలోని రాజా వీధికి పంచాయతీకి చెందిన రూ.5 లక్షల నిధులతో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. రోడ్డు వేయడంతో సర్పంచ్‌కు రాజా వీధి వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇద్దరు మహిళలకు పాముకాటు

పొందూరు: వ్యవసాయ పనుల కోసం పొలాల్లోకి వెళుతున్న రైతులు పాము కాటుకు గురవుతున్నారు. లైదాం గ్రామ సమీపంలో పొలంలోకి దిగిన జి.పార్వతమ్మకి నాగుపాము కాటువేసింది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించడంతో సకాలంలో చికిత్స అంది ప్రాణాపాయం తప్పింది. రెండు రోజుల క్రితం కెంబూరు ఆదిలక్ష్మికి పొలంలో పాము కాటు వేయడంతో ప్రాణాపాయస్థితి ఏర్పడింది. ఆమెను పొందూరు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కొత్తూరు: మండలంలోని కడుము కాలనీలోని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఈ స్థలాన్ని కలాపాడాలని స్థానిక తహసీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య కాలనీకి చెందిన వి.వాసు, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరావు తదితరులు శనివారం వినతిపత్రం అందజేశారు. తొలిత తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కాలనీలో రిజర్వ్ స్థలంలో ఇప్పటికే ఎంపీయూపీ స్కూల్, శివాలయం, వాటర్ ట్యాంక్‌లను నిర్మించడం జరిగిందన్నారు. కాలనీ వాసులకు సామాజికపరంగా అవసరమైన నిర్మాణాలు చేసేందుకు ఈ స్థలం రిజర్వ్‌గా ఉందన్నారు. కొంతమంది ఈ స్థలాన్ని స్వాదీనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌ను కూడా విన్నవించామన్నారు.